సాక్షి
కుమురం భీం

బుధవారం, 23, అక్టోబర్, 2024



డియర్.. న్యూ టీచర్
ఉమ్మడి జిల్లాలో 1049 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. పవిత్రమైన టీచర్ వృత్తిలోకి వచ్చిన వారు.. విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాల్సి ఉంది. 8లో▸



పశువులకేది బీమా
పశువులకు బీమా అమలు చేయకపోవడంతో పాడిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పశువులు మరణిస్తున్నా రైతులను పట్టించుకునే వారు కరువయ్యారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /22.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో అక్రమాలకు పాల్పడే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం, పశువులు, ఇసుక రవాణా చేయడం, గంజాయి, గుట్కా తరలించడం, మట్కా, గ్యాంబ్లింగ్ తదితర నేరాలు చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా 87126 70505 నంబర్‌లో తెలియజేయాలని కోరారు.

రేపు రక్తదాన శిబిరం
ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. రక్తదానంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారి ప్రాణాలు నిలబెట్టాలన్నారు. రక్తదాన శిబిరంలో పోలీసులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పలువురు సీఐలు బదిలీ
ఆసిఫాబాద్: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్– 4 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్‌నగర్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న టి.శంకరయ్య హైదరాబాద్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనగా.. రామగుండం ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రప్రసాద్‌ను కాగజ్‌నగర్‌కు బదిలీ చేశారు. రామగుండం సీసీఆర్‌బీ నుంచి సీఐ బుద్దెస్వామిని రెబ్బెనకు బదిలీ చేయగా.. రెబ్బెన సీఐ చిట్టిబాబును హైదరాబాద్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, అలాగే ఆసిఫాబాద్ సీఐ సతీశ్ హైదరాబాద్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, హైదరాబాద్‌లో ఇంటెలిజెన్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్న బుద్దె రవీందర్‌ను ఆసిఫాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సాక్షి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాక్షి జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైందని డీఎస్‌వో మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు మంగళవారం తెలిపారు. అక్టోబర్ 7, 8 తేదీల్లో హనుమకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జావెలిన్‌త్రో పోటీల్లో సాక్షి ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్‌ను డీటీడీవో రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్ అభినందించారు.

మరో నలుగురికి బెయిల్



స్వాగతం పలుకుతున్న సుచిత్

ఆసిఫాబాద్: ఆదివాసీ మహిళపై జరిగిన దాడి అనంతరం జైనూర్‌లో చోటుచేసుకున్న ఘర్షణల్లో అరెస్టయిన ఆదివాసీల్లో మరో నలుగురికి మంగళవారం జిల్లా సెషన్స్ కోర్టులో బెయిల్ లభించింది. ఈ కేసులో ఇప్పటికే 26 మందికి బెయిల్ లభించగా.. ఐదు కేసుల్లో మరో నలుగురికి మంగళవారం బెయిల్ మంజూరైందని బీజేపీ నాయకుడు, సీనియర్ న్యాయవాది బోనగిరి సతీశ్‌బాబు తెలిపారు. కరీంనగర్ జైలు నుంచి విడుదలైన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావు, మరో ముగ్గురికి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, ఆదివాసీ నాయకులు పూలదండలతో స్వాగతం పలికారు.

ఒక కట్ట.. రెండు ప్రయోజనాలు

- కైరిగూడ సమీపంలో రూ.14.74 కోట్లతో రక్షణ కట్ట
- ఓసీపీ విస్తరణకు అడ్డంకులు లేకుండా..
- వట్టివాగు ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా నిర్మాణం
- వచ్చే వర్షాకాలంలోగా పూర్తి చేయాలని ప్రణాళికలు



రక్షణ కట్ట నిర్మాణంపై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన (ఆసిఫాబాద్): బొగ్గు నిక్షేపాలకు పెట్టింది పేరు బెల్లంపల్లి ఏరియా. ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తితో కళకళలాడిన ఏరియా కాలానుగుణంగా మూతబడిన గనులతో బోసిపోయింది. ప్రస్తుతం ఏరియాకు తలమానికంగా నిలిచే తిర్యాణి మండలం కైరిగూడ ఓసీపీ విస్తరణకు వట్టివాగు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ అడ్డంకిగా మారింది. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. వట్టివాగు బ్యాక్ వాటర్ నుంచి ఓసీపీకి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు సింగరేణి యాజమాన్యం రక్షణ కట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ కట్ట నిర్మాణంతో బ్యాక్ వాటర్‌తో కైరిగూడ ఓసీపీకి.. అలాగే ఓసీపీ తవ్వకాలతో వట్టివాగు ప్రాజెక్టుకు ఎలాంటి ముప్పు ఉండదని అధికారులు చెబుతున్నారు.

రూ.14.74 కోట్ల నిధులు
జిల్లాలోని తిర్యాణి మండల పరిధిలో కైరిగూడ ఓసీపీ ద్వారా బొగ్గు ఉత్పత్తి కార్యకలాపాలను సింగరేణి యాజమాన్యం చేపడుతోంది. మరో ఐదేళ్ల పాటు కొనసాగే ఈ ఓసీపీలో ఇంకా 20 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో వెలికితీసేందుకు యాజమాన్యం ఓసీపీని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వట్టివాగు ప్రాజెక్టు వైపు ఓసీపీని విస్తరిస్తుండగా ప్రాజెక్టులో నిల్వ నీటి ద్వారా ఓసీపీకి ఎప్పటికైనా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. దీనిని గుర్తించిన యాజమాన్యం ఓసీపీకి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ముందస్తుగా రక్షణ చర్యలు చేపట్టింది. ఓసీపీని ప్రాజెక్టు వైపు విస్తరిస్తున్న క్రమంలో ప్రాజెక్టు నీరు ఓసీపీ వైపు రాకుండా ఉండేందుకు కిలోమీటర్ పొడవైన మట్టి కట్టను రూ.14.74 కోట్ల నిధులతో నిర్మించాలని నిర్ణయించింది. కట్ట నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా కట్ట నిర్మాణానికి భూమిపూజ సైతం చేశారు. వచ్చే వర్షాకాలంలోగా నిర్మాణ పనులు పూర్తిచేయాలని యాజమాన్యం గడువు నిర్దేశించింది. కిలోమీటర్ పొడవుతో నిర్మించే కట్ట ప్రాజెక్టు నీటి తాకిడితో కోతకు గురికాకుండా స్టోన్ పిచ్చింగ్‌తో నిర్మించేలా డిజైన్ చేశారు. ఈ కట్ట నిర్మాణం పూర్తయితే కైరిగూడ ఓసీపీ నుంచి వట్టివాగు ప్రాజెక్టుకు.. వట్టివాగు ప్రాజెక్టు ద్వారా కైరిగూడ ఓసీపీకి రక్షణ ఏర్పడుతుంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన పనికావడంతో యాజమాన్యం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతోంది.

పూడికతో ఆనవాళ్లు కోల్పోతున్న 'వట్టివాగు'

ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల పరిధిలో వ్యవసాయ భూములకు సాగు నీరందించాలనే లక్ష్యంలో ఆసిఫాబాద్ మండలంలో నిర్మించిన వట్టివాగు ప్రాజెక్టు సిల్ట్(పూడిక)తో నిండిపోయి ఆనవాళ్లు కోల్పోయే స్థాయికి చేరుకుంది. వట్టివాగు ప్రాజెక్టు ద్వారా ఈ రెండు మండలాల పరిధిలో 25వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. ప్రస్తుతం ఐదు వేల ఎకరాలకు మించి సాగునీరందడం లేదు. ప్రాజెక్టుకు సమీపంలోనే సింగరేణి యాజమాన్యం కైరిగూడ ఓసీపీని నిర్వహించడంతోపాటు ఓసీపీలో వెలికితీసే ఓబీ మట్టి డంపింగ్ నుంచి వర్షాలకు భారీగా సిల్ట్ ప్రాజెక్టులోకి చేరుకుంది. గతంలో యాజమాన్యం పూడిక ప్రాజెక్టులోకి చేరకుండా రక్షణ చర్యలు, ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించినప్పటికీ పూర్తిస్థాయిలో అడ్డుకోలేకపోయింది. ఇరిగేషన్ అధికారులు సైతం ప్రాజెక్టులో సిల్ట్ తొలగించే పనులు చేపట్టకపోవటంతో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ఎట్టకేలకు యాజమాన్యం కైరిగూడ ఓసీపీ రక్షణ కోసం నిర్మిస్తున్న రక్షణ కట్టతో వట్టివాగు ప్రాజెక్టుకు ఓసీపీ ద్వారా కలిగే ముప్పు నుంచి కొంతమేర ఉపసమనం లభిస్తుందని రైతులు భావిస్తున్నారు.



వట్టివాగు ప్రాజెక్టు (ఫైల్)

వర్షాకాలంలోగా పూర్తిచేస్తాం



వట్టివాగు ప్రాజెక్టు నీటిద్వారా కైరిగూడ ఓసీపీకి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండాలనే లక్ష్యంలో రూ.14.74 కోట్లతో రక్షణ కట్ట నిర్మాణం చేపడుతున్నాం. వచ్చే వర్షాకాలంలోగా కట్ట నిర్మాణం పూర్తిచేస్తాం. భవిష్యత్తులో ప్రాజెక్టు నీరు ఓసీపీలోకి రాకుండా ఉండేందుకు కట్ట రక్షణగా ఉంటుంది. అలాగే ప్రాజెక్టుకు సైతం ఓసీపీతో ఎలాంటి ప్రమాదం ఉండదు.

– శ్రీనివాస్, జీఎం, బెల్లంపల్లి ఏరియా

'నీతి ఆయోగ్' పనులు పకడ్బందీగా చేపట్టాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్: నీతిఆయోగ్ ఆధ్వర్యంలో జిల్లాలో అభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎస్ఐడీసీ జిల్లా డైరెక్టర్ సెంట్రల్ ప్రభారి రజత్‌కుమార్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో నీతి ఆయోగ్ కింద కొనసాగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆకాంక్షత కార్యక్రమానికి సంబంధించిన పనులను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్‌డీవో దత్తారావు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆకాంక్షత(ఎక్స్‌ప్రెషనల్) కార్యక్రమంలో భాగంగా నీతిఆయోగ్ ఆధ్వర్యంలో 2018 నుంచి ఆరు అంశాలపై వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్యం, పోషకాలు, సాగునీరు, నైపుణ్యత అభివృద్ధి, ఆర్థిక సహకారం, విద్య, వైద్య అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని వివరించారు. నీతి ఆయోగ్ ద్వారా మంజూరైన రూ.3 కోట్లతో 279 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు రంగులు, బొమ్మలు వేయించడం, తాగునీరు, మూత్రశాలలు, న్యూట్రిగార్డెన్, విద్యుత్ సరఫరా, చిన్నారులకు ఆట వస్తువులు, పాఠశాల అభివృద్ధి పనులు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లల సంక్షేమంలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. మండల సమాఖ్య భవనాల నిర్మాణం, బల్క్ మిల్క్ సెంటర్, కుట్టు శిక్షణా కేంద్రాలు, డెయిరీ మిల్క్ సెంటర్, జంతు జనన నియంత్రణ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి పాల్గొన్నారు.

అవే ఆంక్షలు! అక్కడేం జరుగుతోంది..!



జైనూర్ మండల కేంద్రం

- జైనూర్‌లో కొనసాగుతున్న బందోబస్తు
- నిత్యం పోలీసు బలగాలతో తనిఖీలు
- పండుగల నేపథ్యంలో ఆంక్షలు తొలగించాలని స్థానికుల విన్నపం

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్ ఇంకా ఆంక్షలు కొనసాగుతున్నాయి. గత నెల 4న ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలతో పోలీసుశాఖ 144 సెక్షన్ విధించిన విషయం తెలిసిందే. జైనూర్ మండలం జంగాం, కాలేజీగూడ, వడ్డెరగూడ(సంజీవ్‌నగర్ కాలనీ)ల వద్ద పోలీసు బలగాలు నిత్యం భారీ బందోబస్తు నిర్వహిస్తున్నాయి. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. అయితే పండుగల నేపథ్యంలో ఆంక్షలు ఎత్తివేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి..
జైనూర్ మండల కేంద్రంలో ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉండటంతో ప్రజలు గుంపులుగా తిరిగేందుకు అనుమతివ్వడం లేదు. కిరాణం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వీలుగా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మండల కేంద్రంలోని రాణి దుర్గావతి కూడలి వద్ద మార్కెట్ ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేపడుతుండటంతో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం కనిపిస్తోంది. జైనూర్ మండలంలోని వివిధ గ్రామాలు, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల నుంచి వచ్చే ప్రజల ఆధార్‌కార్డులు పరిశీలించిన తర్వాతే వారిని జైనూర్ మండల కేంద్రానికి వెళ్లేందుకు అనుమతిస్తున్నారు.

త్వరలో దండారీ ఉత్సవాలు
జిల్లావ్యాప్తంగా త్వరలో దండారీ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 31న దీపావళి పండుగ సైతం ఉంది. మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు కొనుగోలు చేస్తారు. ఈ తరుణంలో జైనూర్‌లో మార్కెట్ పూర్తిస్థాయిలో తెరుచుకుంటుందా.. లేదా అనేది అనుమానంగా మారింది. ఘర్షణల అనంతరం మొదట మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ప్రస్తుతం మొబైల్ నెట్‌వర్క్ పునరుద్ధరించినా.. ఇంకా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రాలేదు. జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల ప్రజలు ఆన్‌లైన్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ధ్రువపత్రాలు పొందేందుకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు ఎలా సమర్పించాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆంక్షలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- ఖర్జెల్లి అటవీ రేంజ్ పరిధిలోని అధికారులపై పలు ఆరోపణలు
- గోప్యంగా సాగుతున్న విచారణ
- మరోవైపు 30 ఏళ్లుగా పట్టు సాగుచేస్తున్న రైతులపై కేసులు
- తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నమే అని ప్రచారం

చింతలమానెపల్లి(సిర్పూర్): ఖర్జెల్లి అటవీ రేంజ్‌లో ఏం జరుగుతోంది.. గుట్టుచప్పుడు కాకుండా అధికారులే స్మగ్లర్లకు సహకరిస్తున్నారా..? ఇంటి దొంగలతోనే అడవులు తగ్గుతున్నాయా..? అటవీ భూముల ఆక్రమణలు ఎందుకు ఆగడం లేదు. ఓ వైపు అధికారులపై వరుస అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రేంజ్ పరిధిలో 30 ఏళ్లుగా పట్టు సాగుచేస్తున్న గిరిజన రైతులపై అధికారులు కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అవినీతి ఆరోపణలను పక్కదారి పట్టించేందుకే కేసులు నమోదు చేశారని రైతులు ఆరోపిస్తుండగా.. రైతులకు అనుమతులు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ– మహారాష్ట్రకు సరిహద్దులుగా ఉన్న ప్రాణహిత నదిని ఆనుకుని ఖర్జెల్లి అటవీ రేంజ్ ఉంది. చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాలలో విస్తరించి ఉన్న ఈ రేంజ్ పరిధిలో విస్తారమైన టేకు వనాలు ఉన్నాయి. మొత్తంగా ఆరు సెక్షన్లు, 18 బీట్లు ఉండగా.. ఐదుగురు బీట్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. చింతలమానెపల్లి మండలంలోని సుమారు 20కిలోమీటర్ల అంతర్రాష్ట్ర రహదారి ఈ అటవీ ప్రాంతంలోనే ఉంది.

దశాబ్దాలుగా కలప అక్రమ రవాణా
ఖర్జెల్లి రేంజ్ అటవీ పరిధిలో భారీస్థాయిలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ టేకు చెట్లు విస్తారంగా ఉండటంతో దశాబ్దాలుగా కలప అక్రమ రవాణా జరుగుతోంది. కాటేపల్లి, గూడెం, దిందా గ్రామాల కేంద్రంగా గతంలో భారీఎత్తున కలప తరలిపోయింది. పట్టుబడి కేసులు నమోదు అయినవి నామమాత్రమే.. గత నెల రోజుల్లో దిందాకు చెందిన ఆరుగురు, కోర్సిని అంబగట్టుకు చెందిన ఎనిమిది మందిపై అటవీ భూములను ఆక్రమించినట్లు కేసులు నమోదు చేసిన అధికారులు వారిని రిమాండ్‌కు తరలించారు. దీనికితోడు పోడు సాగుకోసం అడవులను నరికివేయడంతో అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. పదేళ్ల క్రితం ఖర్జెల్లి రేంజ్‌లోని మాలగూడ వీఎస్ఎస్‌లో సుమారుగా రూ.కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మరుగున పడిపోయింది.

అధికారుల కొరత
ఖర్జెల్లి రేంజ్ మహారాష్ట్రలోని ఆళ్లపల్లి డివిజన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ డివిజన్లకు మధ్య ఉంది. గతంలో ఈ మార్గంలో భారీస్థాయిలో కలపను తరలించగా మహారాష్ట్ర అధికారులు కాగజ్‌నగర్ డివిజన్‌లో కేసులు నమోదు చేశారు. కీలకంగా ఉన్న ఖర్జెల్లి డివిజన్‌లో అధికారుల కొరత ఉంది. అడవుల రక్షణ సిబ్బందికి భారంగా మారుతోంది. ఇక్కడ రేంజ్ అధికారిగా రాజేందర్ పదవీ విరమణ పొందగా.. అనంతరం వచ్చిన ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి మాత్రమే కొద్దినెలలు మాత్రమే పనిచేశారు. అప్పటి నుంచి సిర్పూర్ రేంజ్ ఎఫ్ఆర్‌వోలు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 18 బీట్లలో కేవలం ఐదుగురు బీట్ అధికారులు మాత్రమే ఉండడం గమనార్హం. ఖర్జెల్లి రేంజ్‌లో అక్రమాలపై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల ఒత్తిడితోనే 30 ఏళ్లుగా అంబగట్టులో పట్టు సాగుచేస్తున్న రైతులను అటవీ అధికారులు అడ్డుకున్నారని స్థానికంగా చర్చసాగుతోంది. ఆరోపణలను పక్కదారి పట్టించే క్రమంతో ఉన్నతాధికారులు ఈ చర్యలకు పాల్పడ్డారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

అధికారులపైనే ఆరోపణలు
గతంలో ఇక్కడ పనిచేసే ఒక డిప్యూటీ రేంజ్ అధికారి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో జిల్లాస్థాయిలో విచారణ చేపట్టారు. సదరు అధికారి కలపను నిలువ ఉంచి తరలించినట్లు ప్రచారం జరిగింది. ఓ నర్సరీలో చేపట్టిన మొక్కల పెంపకంలో సదరు అధికారి తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ బృందం ఉన్నతాధికారులకు నివేదిక సైతం అందించారు. ఆ అధికారి బదిలీ కాగానే తదుపరి చర్యలు లేకుండానే ఆ అధ్యాయం ముగిసింది. అలాగే కబ్జాదారుల వద్ద మామూళ్లు తీసుకుని అటవీ భూముల ఆక్రమణకు సహకరించారని పలువురు అధికారులపై ఆరోపణలు వచ్చాయి. కాటెపల్లి, గూడెం, దిందా, గంగాపూర్, బూరెపల్లి బీట్లలో పనిచేసే అధికారులపై పలుమార్లు విచారణ కూడా జరిగింది. గతంలో డిప్యూటీ రేంజ్ అధికారిగా పనిచేసిన ఇక్బాల్, సెక్షన్ అధికారులు తిరుమల్‌రావు, తాజాగా దిందా సెక్షన్ అధికారి మోహన్ నాయక్‌పై విచారణ చేపట్టారు. ప్రజల భాగస్వామ్యం ఉండే నర్సరీల పెంపకం, మొక్కలు నాటడం, భూముల ఆక్రమణలపై చేపట్టే విచారణలో గోప్యత పాటించడంపై విమర్శలు వస్తున్నాయి.



ఖర్జెల్లి అటవీ రేంజ్ కార్యాలయం

అనుమతులు తీసుకోవాలని సూచించాం
అటవీ అధికారులు పట్టుపురుగుల పెంపకాన్ని అడ్డుకున్న మాట వాస్తవమే. అనుమతులు తీసుకోవాలని రైతులకు సూచించాం. వారికి ఐటీడీఏ నుంచి గుర్తింపు ఉన్నా అటవీ శాఖ అనుమతులు లేవు. రేంజ్ పరిధిలో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఉన్న సిబ్బంది ప్రస్తుతం లేరు. అంతా కొత్త సిబ్బంది ఉన్నారు. సమన్వయంతో విధులు నిర్వర్తిస్తున్నాం.

– ఇక్బాల్, ఇన్‌చార్జి అటవీ రేంజ్ అధికారి, ఖర్జెల్లి

హక్కుల కోసం గిరిజన వీరుల పోరాటం

- అదనపు కలెక్టర్ దాసరి వేణు
- పాత రౌటసంకెపల్లిలో కుమురంభీం, ఎడ్ల కొండు వర్ధంతి



మౌనం పాటిస్తున్న అదనపు కలెక్టర్ వేణు, అధికారులు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీ ప్రజల హక్కుల కోసం గిరిజన వీరులు అలుపెరగని పోరాటం చేశారని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. కుమురంభీం జన్మస్థలం ఆసిఫాబాద్ మండలంలోని పాతరౌట సంకెపల్లిలో మంగళవారం ఎడ్ల కొండు, కుమురంభీం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. డీటీడీవో రమాదేవి, ఆర్డీవో లోకేశ్వర్, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావుతో కలిసి కుమురంభీం, ఎడ్ల కొండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుమురంభీం, ఎడ్ల కొండు తమ జీవితాలను పణంగా పెట్టి జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆనాటి గిరిజన యోధుల పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమన్నారు. భీం పుట్టిన గ్రామం రౌటసంకెపల్లి అభివృద్ధికి నివేదికలు రూపొందించామన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పార్టీలకు అతీతంగా ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఆదివాసీ నాయకులు అర్జు, కోవ విజయ్, వెంకటేశ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, ఎడ్ల కొండు వారసులు బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి
ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. మండలంలోని అలీగూడ, పార్వతిగూడ, మోవాడ్ పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేలా బోధన సాగించాలని సూచించారు.

కుమురంభీంకు నివాళి

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం కుమురంభీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం చేపట్టిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి కుమురంభీం పోరాటమే స్ఫూర్తి అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో జోడేఘాట్ అభివృద్ధికి కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. హక్కుల కోసం భీం సాగించిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి